సాక్షి అనకాపల్లి

సోమవారం । 5 । జూన్ । 2023



పోటెత్తిన భక్తులు

అనకాపల్లి గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు.

8లో



ముగిసిన నాటిక పోటీలు

అనకాపల్లి జార్జిక్లబ్ ఆవరణలో నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు ఆదివారంతో ముగిశాయి.

8లో

రైతులకు సబ్సిడీపై ఎరువులు



ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందిస్తున్న ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కోరారు.

8లో

న్యూస్‌రీల్

చెరకు పంటను ధ్వంసం చేసిన అడవి పందులు



అడవి పందులు ధ్వంసం చేసిన చెరకు పంటను చూపుతున్న రైతు

చోడవరం: మండలంలోని అన్నవరం రెవెన్యూ పరిధిలో రైతులు పొట్నూరు సింహాచలం, పుల్లేటి సత్యనారాయణ, చిట్టిబాబులకు చెందిన చెరకు పంటను ఆదివారం అడవి పందులు ధ్వంసం చేశాయి.వాటిని తరిమేందుకు ప్రయత్నించగా తమపై దాడిచేసేందుకు వచ్చాయని, వెంటనే భయంతో వెనక్కి వచ్చేశామని రైతులు చెప్పారు. అడవి పందులను నిరోధించేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఇటీవల అడవి పందుల సంచారం ఎక్కువైందని, వాటిని కట్టడి చేయకపోతే పంటలు నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టులు విలీనం

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పునర్విభజనలో భాగంగా కశింకోట, అనకాపల్లి రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టులు అనకాపల్లి పట్టణ ప్రాజెక్టు పరిధిలో విలీనం చేసినట్టు సీడీపీవో పి.ప్రభావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విలీనంలో భాగంగా సూపర్‌వైజర్ల బదిలీలు జరిగాయన్నారు. గ్రేడ్-1, గ్రేడ్-2 ఒక్కొక్కరు అనకాపల్లి ప్రాజెక్టు పరిధిలో ఉన్నట్లు పేర్కొన్నారు. అనకాపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 234 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నట్లు ఆమె చెప్పారు.

భూ వివాదంలో 12 మందిపై కేసు

మునగపాక: మండలంలోని గొల్లలపాలెంలో రెండు వర్గాల మధ్య జరిగిన భూ వివాదానికి సంబంధించి 12 మందిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ మన్మధరావు తెలిపారు.వివరాలు ఇలా ఉన్నాయి. గొల్లలపాలెంలో బర్ల నూకప్పారావు,మురుకుర్తి లక్ష్మిల మధ్య భూ సమస్య ఏర్పడింది. వివాదం తలెత్తడంతో కొట్లాటకు దారి తీసింది. రెండు వర్గాల వారు పరస్పరం దాడి చేసుకున్నారు. దీంతో రెండు వర్గాలకు చెందిన 12 మందిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు మన్మధరావు తెలిపారు.

ఆటో దగ్ధం

- రూ.4.50 లక్షల నష్టం



దేవరాపల్లి మండలం వెంకటరాజుపురం వద్ద దగ్ధమవుతున్న ఆటో

దేవరాపల్లి(అనకాపల్లి జిల్లా): ఇంజిన్‌లో మంటలు చెలరేగి ఓ ఆటో దగ్ధమైన సంఘటన మండలంలోని వెంకటరాజుపురం స్టోన్ క్రషర్ వద్ద ఆదివారం జరిగింది. కృష్ణా జిల్లా నందిగామ గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు నాయిని దుర్గా ప్రసాద్, త్రినాథ్ ఆటోపై గ్రామాల్లో తిరుగుతూ ఇన్‌స్టాల్‌మెంట్‌పై గృహోపకరణ సామగ్రిని విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. వ్యాపారంలో భాగంగా ఆదివారం చీడికాడ మండలంలో సామగ్రి విక్రయించి, దేవరాపల్లి వస్తుండగా వెంకటరాజుపురం వద్ద ఇంజిన్ నుంచి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. తండ్రీకొడుకులు ఆటో దిగి ప్రాణ భయంతో పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో ఆటో, అందులోని సామగ్రి పూర్తికి కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.4.50 లక్షల నష్టం జరిగినట్టు బాధితులు తెలిపారు. వెంకటరాజుపురం సర్పంచ్ దాసరి సంతోష్‌కుమార్ మంటలు అదుపు చేసే ప్రయత్నం చేసిప్పటికీ ఫలితం లేకపోయింది.

నేటితో పాలిటెక్నిక్ కౌన్సెలింగ్ పూర్తి

అనకాపల్లిటౌన్ : పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు సోమవారంతో కౌన్సెలింగ్ పూర్తవుతుందని మండలంలోని రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. కళాశాలలో ఆదివారం 92,001 నుంచి 1,08,000 ర్యాంక్ విద్యార్థు లకు కౌన్సెలింగ్ నిర్వహించినట్టు ఆయన చెప్పారు.72 మంది విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించినట్టు తెలిపారు. సోమ వారం 1,08,001 నుంచి ఆఖరి ర్యాంక్ వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు.

తలచుకుంటే.. వణుకొస్తోంది

- ఏం జరిగిందో తెలుసుకునేందుకు గంట సమయం పట్టింది
- మొబైల్ ఫ్లాష్ లైట్ వేస్తే మాతో ప్రయాణించినవారు విగతజీవులుగా కనిపించారు
- దేవుడు పునర్జన్మ ఇవ్వడం వల్లే.. ఇక్కడికి రాగలిగాం..
- బాధలో ఉన్నప్పుడు భరోసా ఇస్తూ ప్రభుత్వం చేసిన సాయం మరువలేనిది
- విశాఖ చేరుకున్న రైలు ప్రమాద బాధిత ప్రయాణికులు

మాటలకందని విషాదం.. మనసుల్ని చిదిమేసింది.. ప్రమాదం జరిగి.. 60 గంటలు గడుస్తున్నా.. ఎవరు ఎక్కడున్నారో..? ఎలా ఉన్నారో తెలియని హృదయ విదారక దృశ్యాలే కనిపిస్తున్నాయి. భయానక ఉత్పాతం నుంచి అదృష్ట వశాత్తూ బయటపడి.. సొంతూళ్లకు తిరిగివచ్చిన వారంతా.. తమకు పునర్జన్మ లభించిందని చెబుతున్నారు. ఒడిశాలో శుక్రవారం రాత్రి జరిగిన ఘోర ప్రమాదంలో చిక్కుకొని ఎలాగోలా బయటపడి వచ్చేసినా.. ఇంకా ఆ రాత్రి తమ జీవితాల్లో కాళరాత్రిలా కళ్లముందే కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఊరుగాని ఊరులో ప్రమాదపుటంచుల్లో హాహాకారాల మధ్య జీవనం గడుపుతూ ప్రతి నిమిషం భయం వెంటాడుతున్న తమకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన సాయం మరువలేనిదని చెబుతున్నారు. విశాఖ చేరుకున్న పలువురు బాధితుల కన్నీటి కథనాలివీ

– సాక్షి, విశాఖపట్నం/మహారాణిపేట



షాక్ నుంచి తేరుకోవడానికి చాలా సమయం పట్టింది



షాలిమార్‌లో రైలు ఎక్కాను. వైజాగ్‌లో దిగాల్సి ఉంది. నేను దివ్యాంగుల కోచ్‌లో ఉన్నాను. భారీ శబ్దం వినిపించింది. మా బోగీ.. గూడ్స్ రైలుకు ఇటువైపున పడిపోయింది. అటు పడి ఉంటే.. ఇప్పుడు మాట్లాడేందుకు ఉండేవాడిని కాదేమో. మా బోగీలో నా పక్కన కూర్చున్న వారిలో ఒకరు అక్కడికక్కడే చనిపోయారు. అది చూసి నాకు భయం మొదలైంది. నరకం కనిపించింది. అతి కష్టమ్మీద.. బోగీ నుంచి బయటకు వచ్చాను. ఏమి కనిపించ లేదు. చాలా మంది ఏడుపులు, కేకలు వినిపిస్తున్నాయి. నా మొబైల్‌లో లైట్ వేసి చూశాను. చాలా మంది రక్తంతో అటు ఇటు తిరుగుతున్నారు. బోగీలో అటు ఇటు.. ఎగిరి పడటం వల్ల.. ఒళ్లంతా నొప్పులైపోయాయి. నడవలేని పరిస్థితిలో ఉన్నాను. మెల్లగా ట్రాక్ దాటి.. ఒక మూల కూర్చున్నాను. ఇంతలో కొందరు ఊరివాళ్లు వచ్చి.. నన్ను అంబులెన్స్ దగ్గరకు తీసుకెళ్లారు. తర్వాత రోజు ఉదయం సీఎం జగన్ మన వైజాగ్ నుంచి మంత్రుల్ని పంపించారని తెలిసింది. తెలుగు వాళ్లందర్ని అక్కడికి తీసుకెళ్లి.. స్పెషల్ ట్రైన్‌లో వైజాగ్ పంపించారు. ఇక్కడ ట్రీట్‌మెంట్ బాగా ఉంది. ప్రతి గంటకు డాక్టర్లు వచ్చి.. ఎలా ఉందని అడుగుతున్నారు. నొప్పులు ఇంకా తగ్గలేదు.. రికవరీ అయ్యేందుకు కొంత టైమ్ పడుతుందని డాక్టర్లు చెప్పారు. నా జీవితాంతం ఈ ప్రమాదం నా కళ్లముందే కనిపిస్తుంటుందేమో. వెంటనే ఆదుకొని వైజాగ్ తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– శంకర్‌రావు, పాతర్లపల్లి గ్రామం, రణస్థలం, శ్రీకాకుళం

బతికున్నానంటే నమ్మలేకపోతున్నాం



ఒక్కసారిగా కుదుపు వచ్చి పడిపోయాను. నా మీద బ్యాగులు, మనుషులు పడిపోయారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాను. కాసేపటి తర్వాత కళ్లు తెరిస్తే.. కొందరు నన్ను మోసుకొంటూ అంబులెన్స్ దగ్గరికి తీసుకొచ్చారు. అక్కడ డాక్టర్లు మొత్తం చెక్ చేశారు. అప్పటి వరకు ఏం జరిగిందో.. ఎందుకు పడిపోయానో తెలీదు. పక్కనున్న వాళ్లని అడిగితే.. రైళ్లు గుద్దుకున్నాయని చెప్పారు. కళ్లముందే శవాల గుట్టలు కనిపించాయి. కొందరు తమ వాళ్లు కనిపించక.. రక్తాలతో అటు ఇటు పరుగెడుతున్నారు. నాకు నా కుటుంబం గుర్తొచ్చింది. భయంతో వణికిపోయాను. నా భర్తకి అప్పటికే దెబ్బలు తగిలున్నాయి. ఆయన నా దగ్గరికి వచ్చారు. ఆయన్ని చూడగానే ఊపిరి వచ్చింది. ప్రభుత్వ సహకారంతో ఇక్కడి వచ్చాం. చాలా బాగా తీసుకొచ్చారు. దారిలో భోజనాలు, పళ్ల రసాలు అందిస్తూ.. జాగ్రత్తగా చూసుకుని వైద్యం అందిస్తున్నందుకు సీఎంకు కృతజ్ఞతలు చెబుతున్నాం. ఇంత ఘోరం జరిగిందని తలచుకుంటేనే భయం, ఏడుపు వచ్చేస్తున్నాయి. బతికున్నానంటే నమ్మలేకపోతున్నాను. మళ్లీ నా పిల్లల్ని, మన వళ్లని చూస్తామని కలలో కూడా అనుకోలేదు.

– భారతి, బుచ్చిరాజుపాలెం, విశాఖపట్నం

పడిపోయిన బోగీలోనే 40 నిమిషాలు



నేను, నా భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి రైలులో ప్రయాణిస్తున్నాం. సాయంత్రం టీ తాగి పిల్లలతో కబుర్లు చెప్పుకుంటున్నాం. ఇంతలో భారీ శబ్దం వినిపించింది. ఒక్కసారిగా మా బోగీ కుదుపునకు గురైంది. బాంబు పేలిందేమోనని భయంతో వణికిపోయాం. బోగీ పక్కకు ఒరిగిపోయింది. అసలేం జరిగిందో మాకు అర్థం కాలేదు. పిల్లలు, నేను, నా భార్య.. తోటి ప్రయాణికులంతా చెల్లాచెదురైపోయాం. 40 నిమిషాలకు పైగా బోగీలోనే ఉండిపోయాం. మా పిల్లలు కాసేపు కనిపించలేదు. చనిపోయారేమోనన్న ఆలోచనతో కాళ్లు, చేతులూ వణికిపోయాయి. నా భార్య నొప్పితో విలవిల్లాడుతోంది. పిల్లల కోసం అరిచాను. మా సీట్లకు రెండు సీట్ల దూరంలో వారు జారిపోయి ఉన్నారు. వారు లగేజీలపై పడటంతో ఎలాంటి గాయాలు కాలేదు. కొందరు ప్రయాణికులు అద్దాలు పగలగొట్టారు. ఈలోగా కొందరు గ్రామస్తులు వచ్చి సాయం చేశారు. ముందుగా పిల్లల్ని బయటకి పంపించాం.. నా భార్యని పైకి లాగారు. తర్వాత నేను బయటికి వచ్చాను. సాయం చేసేందుకు వచ్చిన వాళ్లు.. ఏం జరిగిందో చెప్పారు. ఈ ప్రమాదం నదిపైన జరిగి ఉంటే.. ఈరోజు ఇలా మాట్లాడే వాళ్లం కాదేమో. కొంచెం ముందు కెళ్లి చూస్తే చాలామంది చనిపోయి ఉన్నారు. వాళ్లని చూసి నాకు ఏడుపు ఆగలేదు. రాష్ట్ర ప్రభుత్వం కొందరు అధికారుల్ని, మంత్రుల్ని పంపించిందని అక్కడ చెప్పడంతో వాళ్ల వద్దకు వెళ్లాను. ట్రైన్‌లో వైజాగ్ వచ్చేశాం. సెవెన్‌హిల్స్ హాస్పిటల్‌లో నాకు, నా భార్యకు మెరుగైన వైద్యం అందుతోంది. రూపాయి ఖర్చు లేకుండా సీఎం వైఎస్ జగన్ మాకు వైద్యం చేయిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి మన రాష్ట్రానికి చెందిన వారిని తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేసిన ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

– లోకేష్, ప్రమాద బాధితుడు

ఇలాంటి ఘోరాన్ని ఎవరూ చూడకూడదు



ఖరగ్‌పూర్ పెళ్లికి వెళ్లి.. కోరమండల్‌లో తిరిగి వస్తున్నాం. ఎస్-3 బోగీలో ఉన్నాం. సాయంత్రం చిన్నగా కునుకు తీస్తున్నాను. ఇంతలో ఒక్కసారిగా బండి జర్క్ అయినట్లు అయింది. ఫాస్ట్‌గా ట్రైన్ వెళ్తోంది కదా.. అందుకే అనుకున్నాను. ఒక్క క్షణంలో కింద పడిపోయాను. నాపైన లగేజీలు, పై బెర్త్‌లో ఉన్న ఇద్దరు పడిపోయారు. బోగీలో జనమంతా ముద్దగా పడిపోయాం. పైనున్న ఒక్కొక్కరూ లేచి ఒకరికొకరం సాయం చేసుకుని బయటపడ్డాం. అప్పటికే.. అందరికీ దెబ్బలు తగిలాయి. నేనైతే స్పృహ కోల్పోయాను. కాసేపటికి ఎవరో నలుగురు ముఖంపై నీళ్లు చల్లితే దుకాణం వద్ద ఉన్నాను. వాళ్లు నా ప్రాణాలు కాపాడారు. ఏం జరిగిందని అడిగితే.. ఘోరం గురించి చెప్పారు. తల్లడిల్లిపోయాను. నా భార్య కోసం వెతికితే.. ఆమె క్షేమంగా ఇంకో చోట ఉందని చెప్పారు. వెంటనే నన్ను అక్కడికి తీసుకెళ్లమని చెప్పాను. దారిలో వెళ్తుంటే.. శవాలను, గాయపడిన వారిని మోసుకెళ్తున్నారు. అది చూశాక దేవుడా.. ఇలాంటి ఘోరాన్ని ఇంకెవరూ చూడకుండా కాపాడు స్వామీ అని మొక్కుకున్నాను. రాష్ట్ర ప్రభుత్వం, బంధువుల సహకారంతో విశాఖ వచ్చేశాను. ఇక్కడ మంచి వైద్యం అందిస్తున్నారు.

– మాధవరావు, బుచ్చిరాజుపాలెం

కాళీమాతే కాపాడింది..!

- తీర్థయాత్రకెళ్లి వస్తుండగా ప్రమాదం
- మాలో ఏడుగురూ బతికి బయటపడ్డాం
- రైలు ప్రమాద బాధితుడు సత్యం



సాక్షి, విశాఖపట్నం: నగరంలోని జాలరిపేట, వాడపేటల నుంచి ఏడుగురు గత నెల 27న తీర్థయాత్రకు బయల్దేరారు. వీరు తొలుత కాశీ వెళ్లి విశ్వేశ్వరుని, అనంతరం కోల్‌కతాలోని కాళీ మాతను దర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో ఈనెల రెండో తేదీన కోల్‌కతాలో కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. వీరిలో ఎస్-1లో ఇద్దరు, ఎస్-4 బోగీలో ఐదుగురు ఉన్నారు. వీరెక్కిన రైలు ఒడిశాలోని బహనగ వద్ద ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగానూ, ఐదుగురు స్వల్పంగా గాయపడ్డారు. వీరు ఆదివారం ఉదయం ఓ వాహనంలో విశాఖ చేరుకున్నారు. ప్రమాద బాధితుల్లో ఒకరైన జాలరిపేటకు చెందిన ఎం.సత్యంకు బాధితుల తరఫున ప్రభుత్వం రవాణా ఖర్చుల కింద రూ.30 వేల చెక్కును మంత్రి బొత్స సత్యనారాయణ ఆదివారం కలెక్టరేట్‌లో అందజేశారు. ఈ సందర్భంగా రైలు దుర్ఘటనపై సత్యం 'సాక్షి'తో మాట్లాడారు. 'ప్రమాదం జరిగే సమయానికి మేం ఎంతో సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నాం. ఇంతలో పెద్ద శబ్దంతో భారీ కుదుపు. క్షణాల్లోనే బోగీలు తిరగబడ్డాయి. అంతా అరుపులు.. కేకలు. ఏం జరిగిందో తెలిసే లోగానే బోగీ అంతా రక్తసిక్తం. చాలామంది చనిపోయారు. మాపైనా చాలా మంది పడిపోయారు. నాతో ఉన్న రాజు, రమణలకు బాగా దెబ్బలు తగిలాయి. నాకు, నా భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. మేం బతుకుతామన్న నమ్మకం లేదు. మాతోటి ప్రయాణికుడు సీహెచ్ రాజు కారుతున్న రక్తాన్ని లెక్క చేయకుండా మమ్మల్ని బతికించాడు. లేదంటే మేమంతా చనిపోయేవాళ్లం. ఆ కలకత్తా కాళీమాతే మమ్మల్ని బతికించింది.' అని కన్నీటి పర్యంతమవుతూ సత్యం చెప్పాడు.

'గడప గడప'లో ప్రజలతో మమేకం

- క్రమం తప్పకుండా అన్ని గ్రామాల్లో నిర్వహించాలి
- పూర్తయిన గ్రామాలకు ప్రభుత్వ నిధులు మంజూరు
- వాటితో సమస్యల పరిష్కారానికి కృషి చేయండి
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి
- మూడు జిల్లాల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలతో సమీక్ష



ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో సమీక్షిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, విశాఖపట్నం: 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని వైఎస్సార్‌సీపీ విశాఖ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి కొనియాడారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి ప్రతీ గడపకూ వెళ్లి ఒక్కో కుటుంబానికి సంక్షేమం పేరిట ప్రభుత్వం నుంచి ఎంత లబ్ధి చేకూరిందో వివరించాలని సూచించారు. అంతేకాకుండా ఈ కార్యక్రమంలో గ్రామాల్లో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి కూడా కృషి చేయాలని సూచించారు. 'గడప గడపకు' కార్యక్రమం పూర్తయిన పంచాయతీలకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న రూ.20 లక్షలతో గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. మూడు జిల్లాల్లో గల ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలను నియోజకవర్గాల వారీగా ఇప్పటి వరకూ పూర్తిచేసిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం వివరాలు వైవీ సుబ్బారెడ్డి అడిగి తెలుసుకున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా సంక్షేమం, అభివృద్ధి పనులను మన ప్రభుత్వం నాలుగేళ్లలో చేసిందని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంతో పోల్చితే మన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 30 రెట్లు అధికంగా చేశామని, ఈ విషయాన్ని ప్రజల్లోకి ప్రతి ఒక్కరూ తీసుకెళ్లాలని సూచించారు. అర్హులందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షన్నారు. ఎక్కడైనా చిన్నపాటి టెక్నికల్ సమస్యల కారణంగా ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే... వారికి తక్షణమే అందేలా కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రతిపక్షాలు చేసే దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ సోషల్ మీడియా వేదికగా వాస్తవాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ, విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనువాసరావు, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గొల్ల బాబూరావు, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, కంబాల జోగులు, సంబంగి వెంకట చినఅప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, బడుకొండ అప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, నాయకులు ఈర్లె అనురాధ, అక్కరమాని వెంకటరావు, వైఎస్సార్‌సీపీ రీజినల్ యువజన విభాగం అధ్యక్షుడు ముత్తంశెట్టి వెంకట శివసాయి పాల్గొన్నారు.

ఆశాజనకంగా 'తాండవ'

- ఖరీఫ్‌కు ఢోకా లేదంటున్న ప్రాజెక్టు అధికారులు



తాండవ జలాశయం

నాతవరం: తాండవ రిజర్వాయర్‌లో నీటి మట్టం ఆశాజనకంగా ఉంది. దీంతో ఖరీఫ్ సీజన్‌లో సాగు నీటికి ఢోకా ఉండదంటూ రైతులు ధీమాతో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలోనే ఏకైక మేజరు ప్రాజెక్టు అయిన తాండవ రిజర్వాయర్‌పై ఆధారపడి నాతవరం,నర్సీపట్నం,కోటవురట్ల పాయకరావుపేట మండలాలతో పాటు కాకినాడ జిల్లా కోటనందూరు రవతలపూడి మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 52వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. గత ఏడాది తాండవ ప్రాజెక్టు నుంచి 120 రోజుల పాటు రెండు ప్రధాన కాలువల ద్వారా రోజుకు 550 క్యూసెక్కుల చొప్పున శివారు ఆయకట్టు వరకు నీటిని విడుదల చేశారు. తాండవ ప్రాజెక్టు ప్రమాదస్థాయి నీటి మట్టం 380 అడుగులు కాగా, డెడ్ స్టోరేజీ నీటి మట్టం 340 అడుగులుగా పరిగణిస్తారు. ప్రస్తుతం తాండవ ప్రాజెక్టులో 370 అడుగుల నీటి మట్టం ఉంది. ఈ నీటిని రెండు కాలవల ద్వారా ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టుకు విడుదల చేస్తే 80రోజుల పాటు ప్రవహిస్తుందని ప్రాజెక్టు అధికారులు అంచనా వేస్తున్నారు, ఈలోపు ప్రకృతి కరుణించి వర్షాలు కురిస్తే ప్రాజెక్టులో నీరు మట్టం మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

మోదకొండమ్మ దీక్షలు విరమణ

మాడుగుల: మోదకొండమ్మ తల్లి మాలధారణ దీక్షలు ఆదివారంతో ముగిశాయి. ఈ నెల 6న మాడుగులలో అమ్మవారి జాతర నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. జాతర సందర్భంగా ఏటా పలు గ్రామాల భక్తులు మాలధారణ చేసి 29 రోజుల పాటు నిష్టతో పూజలు చేస్తారు. ఈ ఏడాది వంద మందికి పైగా భక్తులు మాలధారణ చేశారు. ఈ దీక్షలు పూర్తి కావడంతో ధర్మిశెట్టి పైడినాయుడు, పల్లా సత్తిబాబు, గండి కొండబాబు తదితర భక్తులు ఇరుముడి కట్టుకుని, అమ్మవారిని దర్శించుకుని దీక్షలు విరమించారు.



దీక్షలు విరమిస్తున్న భక్తులు

ఈదురు గాలులు.. భారీ వర్షం



కొత్తకోటలో విద్యుత్ వైర్లపై పడిన చెట్టు



వర్షపు నీటితో చెరువును తలపిస్తున్న అబిద్‌సెంటర్‌లోని మెయిన్‌రోడ్డు

నర్సీపట్నం: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి, భారీ వర్షం పడింది. గంటన్నరకు పైగా ఏకధాటిగా వర్షం కురిసింది. నర్సీపట్నం మండలం చెట్టుపల్లిలో పిడుగుపాటుకు మట్టా తాతబ్బాయికి చెందిన గేదె, ఆవు, ఒ.ఎల్.పురంలోని చవల తాతారావుకు చెందిన పాడి గేదె మృతి చెందాయి. చెట్టుపల్లి, పెదబొడ్డేపల్లి, శారదనగర్, చింతపల్లి రూట్‌లో చెట్లు విరిగి విద్యుత్‌లైన్లపై పడ్డాయి. దీంతో నర్సీపట్నం టౌన్‌తో పాటు, రూరల్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సిబ్బంది వెంటనే మరమ్మతులు చేపట్టి టౌన్‌లోని కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. నర్సీపట్నంలోని వెంకునాయుడుపేట, బొంతువీధి, శారదనగర్, బ్యాంక్ కాలనీ నీటమునిగాయి. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగుకాలువలు పొంగి ప్రధాన రోడ్లపై ప్రవహించాయి. అబిద్‌సెంటర్ మెయిన్ రోడ్డు, శారదనగర్‌లోని సాయిబాబా ఆలయానికి వెళ్లే ప్రధాన రోడ్డు చెరువులను తలపించాయి. ఖాళీస్థలాల్లో భారీగా నీరు చేరింది.



పిడుగుపాటుకు చెట్టుపల్లిలో మృతిచెందిన పశువు

రావికమతం: కొత్తకోట పరిసర గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కొత్తకోట,ఒమ్మవరం,కన్నంపేట,దొండపూడి గ్రామాల శివార్లలో టేకు చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లపై పడడంతో సరఫరా నిలిచిపోయింది.

కలశ స్థాపన ఉత్సవాలు ప్రారంభం

చోడవరం: స్థానిక స్వయంభూ విఘ్నేశ్వర స్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన రాజగోపురాల ప్రారంభం సందర్భంగా కలశ స్థాపన మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. తూర్పు, పశ్చిమ రాజగోపురాలను ఇటీవల నిర్మించారు. వీటిని ప్రారంభించేందుకు ఆదివారం నుంచి 7వ తేదీ వరకు కలశస్థాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో హోమం జరిపారు. ఉదయం ఆలయ ప్రదక్షిణ,యాగశాల ప్రదక్షిణ, విఘ్నేశ్వరస్వామిపూజ, పుణ్యాహవచనం, గోపూజ, నవగ్రహ, నక్షత్ర పూజలు జరిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పల జయదేవ్, ట్రస్టుబోర్డు చైర్మన్ నున్న నాగేశ్వరరావు, దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.



యాగశాలలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పల జయదేవ్

ఇద్దరు వివాహితల అదృశ్యం

గొలుగొండ : మండలంలో ఏఎల్‌పురం, లింగంపేటకు గ్రామాలకు చెందిన ఇద్దరు వివాహిత మహిళలు, చిన్నారి అదృశ్యం అయినట్టుగా కటుంబ సభ్యులు ఫిర్యాదులు చేసినట్టు కృష్ణదేవిపేట ఎస్‌ఐ ఉపేంద్ర తెలిపారు. ఏఎల్‌పురానికి చెందిన వివాహిత మంజేటి అరుణ(23), ఈ నెల 2వ తేదీన తెల్లవారి నుంచి కనిపించలేదని భర్త ఫిర్యాదులు చేశారని తెలిపారు. లింగంపేట గ్రామానికి చెందిన వివాహిత నల్లబెల్లి దివ్య(25) తన కుమార్తె(3) సంవత్సరాల కుమార్తెతో గత నెల 27 నుంచి కనిపించ లేదని భర్త ఫిర్యాదులు చేయడంతో కేసు నమోదు చేసినట్టు తెలిపారు. వీరు ఆచూకీ తెలిసిన వారు కృష్ణదేవిపేట పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సంప్రదించాల్సిన నంబర్లు 9440904240 తెలపాలని కోరారు.

ముగిసిన నాటిక పోటీలు

- మూడు రోజులుగా ప్రేక్షకులను అలరించిన నాటికలు


'అలితో సరదాగా' లో సన్నివేశం

అనకాపల్లిటౌన్ : స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో వై.కె.నాగేశ్వరరావు నాటక కళాపరిషత్, ఆదిలీలా ఫౌండేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికలు మూడో రోజైన ఆదివారంతో ముగిసాయి. నాటకపోటీలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

వివాహ బంధానికి అర్థం తెలిపే 'నాన్నా నేనొచ్చేస్తా'...

ఈ సమాజంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు చదవు నుంచి పెళ్లి వరకూ పిల్లలు అడిగిందల్లా కాదనకుండా యిచ్చుకుంటూ పోతున్నారు. మితిమీరిన వాత్సల్యం, మమకారాన్ని పెంచుకొని స్వేచ్ఛనిచ్చి పెంచితే దాని ఫలితం, వివాహమైన కొంతకాలానికే వైవాహిక జీవితంలో భార్యాభర్తల మధ్య వచ్చిన మనస్పర్ధలను పరిష్కరించుకోలేక పోతున్నారు. మెట్టినింటి నుంచి, పుట్టినింటికి 'నాన్నా-నేనొచ్చేస్తా' నంటూ ప్రయాణం చేస్తున్న సుధలాంటి అమ్మాయికి, భర్త శ్రీరామ్‌కి, తల్లిదండ్రులు రాఘవ, సావిత్రిల మధ్య జరిగిన సంఘర్షణకు దృశ్యరూపమే 'నాన్నా నేనొచ్చేస్తా..' నాటిక ఇతివృత్తం. గుంటూరు అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ వారు ప్రదర్శించిన ఈ నాటిక సందేశాత్మకంగా సాగింది. మూలకథ గంటి రాజేశ్వరి(ఈశ్వరి), రచన తాళాబత్తుల వెంకటేశ్వరరావు, దర్శకత్వం అమృతలహరి అందించారు.

'అలితో సరదాగా(హాస్యనాటిక)'....

ప్రపంచీకరణ నేపథ్యంలో పెరిగిన సాంకేతిక విజ్ఞానం కారణంగా నేటి తరం యువతకు ఉన్నతోద్యోగాలతో పాటు ఊహకందనంత ఆదాయం చేతికందుతోంది. అది అవసరాలకు మించి ఉండడంతో కొందరి బుద్ధి వెర్రి తలలు వేస్తోంది. మితిమీరిన పాశ్చాత్యపోకడల కారణంగా కొత్తకొత్త సరదాలు పుట్టుకొస్తున్నాయి. అవి వారి జీవితాలతో పాటు సంస్కృతిని కూడా దిగజార్చుతూ పలు అనర్థాలకు దారి తీస్తున్నాయి. హాస్యంతో మేళవించి యువత విజ్ఞతతో వ్యవహరించాలనే సందేశాన్ని ఇస్తుంది ఈ ×అలితో సరదాగా× నాటిక. చిలకలూరిపేట ది అమెచ్యూర్ డ్రమెటిక్ అసోషియేషన్ చిలకలూరిపేట వారు ప్రదర్శించారు. రచన అద్దేపల్లి భరత్‌కుమార్, దర్శకత్వం షేక్ షఫి ఉజ్మా అందించారు. కార్యక్రమంలో నాటక కళాపరిషత్ ప్రతినిధులు బొప్పన నరసింహారావు, జి.మల్లికార్జునరావు, నడింపల్లి వెంకటేశ్వరరావు, రంగనాయకులు క్లబ్ అధ్యక్షుడు బుద్ధ కాశీవిశ్వేశ్వరరావు, కార్యదర్శి మళ్ల చంద్రశేఖర్, కోశాధికారి ఆళ్ల వెంకట నూకేశ్వరరావు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు రేపు తుది గడువు

నర్సీపట్నం: ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు ఈ నెల 6వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ డి.శ్రీనివాసచారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2023-24 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాలకు ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు మంగళవారం లోపు సమీప ఐటీఐల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వెరిఫికేషన్ చేయించుకున్న వారికే కౌన్సెలింగ్‌కు అనుమతిస్తామన్నారు.

మామ అల్లుళ్ల మధ్య కొట్లాట

అనకాపల్లిటౌన్ : మామిడిపాలెం గ్రామంలో ఆదివారం మామ అల్లుళ్ల మధ్య కొట్లాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో మామకు తీవ్రంగా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ విషయమై గ్రామీణ పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని చెప్పారు.

నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు


చలువ పందిరి నీడలో వంటలు చేసుకుంటున్న భక్తులు


నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


రహదారిపై క్యూలైన్లో భక్తులు

అనకాపల్లి టౌన్: గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున అమ్మవారి దర్శనానికి తరలి రావడంతో ఆలయ ఆవరణలో క్యూలైన్లు కిటకిటలాడాయి. కొంతమంది భక్తులు ఇక్కడ చలువ పందిళ్ల నీడలో వంటలు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. కుటుంబ సమేతంగా భోజనాలు చేసి అమ్మవారి ఆశీస్సులు పొందారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీరు అందించాయి. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి ప్రసాదాన్ని ఉచితంగా అందజేశారు. గర్భిణులకు, బాలింతలకు ప్రత్యేక దర్శనం కల్పించారు. బాలింతలు వారి పిల్లలకు పాలు ఇచ్చేందుకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లును ఆలయ ఈవో బండారు ప్రసాద్ కల్పించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐలు దాడి మోహనరావు, టి.శ్రీనుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ద్విచక్ర వాహనాలను మాత్రమే అమ్మవారి ఆలయం వరకూ అనుమతించి, మిగిలిన వాహనాలను పార్కింగ్ ప్రదేశాల్లో నిలుపుదల చేశారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు

రాజవొమ్మంగి : జడ్డంగి పోలీస్‌స్టేషన్ పరిధిలో ముగ్గురు వ్యక్తులు మోటారుసైకిల్‌పై 10 కిలోల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. శనివారం జరిగిన ఈ కేసు వివరాలు పోలీసులు ఆదివారం రాత్రి వెల్లడించారు. నిందితులు గంజాయిని ధారకొండలో కొనుగోలు చేసి రాజమహేంద్రవరం తరలిస్తుండగా పట్టుకొన్నామని జడ్డంగి ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు. ఈ ముగ్గురూ తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ జిల్లాలకు చెందిన వారన్నారు. నిందితుల నుంచి రూ. 2,520 నగదు, మోటారుబైక్, గంజాయిని స్వాధీనం చేసుకొన్నామన్నారు.

రైతులకు సబ్సిడీపై ఎరువులు

- రాజాంలో యూరియా పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందిస్తున్న ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కోరారు. మండలంలోని రాజాం గ్రామ సచివాలయ పరిధిలోని రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ఎరువులను ఆదివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూరియా ధర రూ.1,330 కాగా, సబ్సిడీపై రైతులకు కేవలం రూ.270కే అందిస్తున్నామన్నారు. ఖరీఫ్‌లో రైతులకు ఎటువంటి విత్తన, ఎరువుల కొరత లేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుబాటులో ఉంచామన్నారు. వీటి కోసం ముందుగా ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని రాయితీపై పొందాలన్నారు. గత టీడీపీ పాలనలో ఏనాడైనా సకాలంలో విత్తనాలుగానీ, ఎరువులుగానీ ఇచ్చిన పాపాన పోలేదని విమర్శించారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో నేరుగా రైతుల వద్దకే వచ్చి ఇస్తున్నామన్నారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, సర్పంచ్ నాగభూషణం, రైతు సంఘం నాయకులు నమ్మి అప్పలరాజు, వై రవి, గుడాల ఆనంద్, పల్లా పోలినాయుడు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మూడో విడత చందనం సమర్పణ


అప్పన్న ఉత్సవమూర్తులకు జ్యేష్ఠాభిషేకాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం మూడో విడత చందనం సమర్పణ శాస్త్రోక్తంగా జరిగింది. పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి ఈ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామికి సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం మూడు మణుగుల చందనాన్ని స్వామికి సమర్పించారు. విశేష పూజలు నిర్వహించారు. తదుపరి స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలో వేంజేపచేసి జ్యేష్ఠాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు.

తుదిదశకు బదిలీల ప్రక్రియ..!

- ఫైనల్ సీనియారిటీ జాబితాలు విడుదల
- అన్ని కేడర్ల ఖాళీల ప్రదర్శన, నేటి నుంచి వెబ్ ఆప్షన్లు
- ఆన్‌లైన్ బదిలీల్లోనూ అయ్యవార్లు అడ్డదారులు
- స్టేషన్ సీనియారిటీ తప్పిదాలపై ఫిర్యాదుల వెల్లువ
- దరఖాస్తుల పరిశీలనలో విద్యాశాఖాధికారుల అలసత్వం


ఫిర్యాదులు ఇస్తున్న ఉపాధ్యాయులు

విశాఖ విద్య: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలంలోని ఓ స్కూల్ అసిస్టెంట్ (బయాలజీ) 9.0301 పాయింట్లకు గాను 17.4960 పాయింట్లు వేసుకోవటంతో సీనియారిటీ జాబితాలో ముందుకెళ్లారు. స్టేషన్ సీనియారిటీ పాయింట్లు తప్పిదాలను గుర్తించిన కొంతమంది ఉపాధ్యాయులు తమకు అన్యాయం జరుగుతుందంటూ డీఈవో కార్యాలయ అధికారులుకు ఫిర్యాదు చేశారు. రేషనలైజేషన్‌కు గురైన వారికి మేలు చేయాలని, స్టేషన్ సీనియారిటీ పాయింట్లు నమోదులో ప్రభుత్వం కొంత వెసులుబాటు కల్పించింది. దీన్ని సాకుగా తీసుకున్న కొంతమంది అయ్యవార్లు బదిలీల్లో మంచి ప్రదేశాల దక్కించుకోవాలనే దుర్బుద్ధితో అడ్డదారులు తొక్కారు. ఫైనల్ సీనియారిటీ జాబితాలో ఇలాంటి వారు చాలా మందే ఉన్నారని తప్పిదాలను గుర్తించిన ఉపాధ్యాయులు ఫిర్యాదులు చేసేందుకు విశాఖలోని డీఈవో కార్యాలయానికి క్యూ కడుతున్నారు.

పైరవీలకు చెక్ పెట్టాలనే ఆన్‌లైన్ బదిలీలు

మాన్యువల్ బదిలీల కోసమని కొన్ని ఉపాధ్యాయ సంఘాలు పట్టుబట్టినా, పారదర్శకతకు పెద్ద పీట వేస్తున్న ప్రభుత్వం ఆన్‌లైన్ బదిలీలకే మొగ్గు చూపింది. దరఖాస్తుల మొదలు ఫైనల్ సీనియార్టీ జాబితా ప్రదర్శన వరకు ఎంఈవో, డెప్యూటీ డీఈవో, డీఈవో స్థాయిలో సమగ్ర పరిశీలన చేసేలా స్పష్టమైన విధి విధానాలు రూపొందించారు. కానీ ప్రభుత్వ విధానాలపై పనిగట్టుకొని వ్యతిరేకించే ఓ ఉపాధ్యాయ సంఘం నాయకుల కనుసన్నుల్లోనే డీఈవో కార్యాలయ అధికారులు అంటగాకుతూ జాబితాలపై పరిశీలన చేస్తుండటంతో తమకు అన్యాయం జరుగుతుందని పలువురు ఉపాధ్యాయులు అంటున్నారు.

లోపం ఎక్కడుంది

బదిలీల్లో ప్రయారిటీ పాయింట్లు కీలకంగా ఉంటాయి. స్టేషన్ సీనియారిటీ పాయింట్లు నమోదులో తప్పిదాలకు పాల్పడితే, అలాంటి ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని ముందుగానే విద్యాశాఖాధికారులు హెచ్చరించారు. కానీ కొంతమంది వీటిని పెడచెవిన పెట్టినట్లు ప్రస్తుత పరిణామాల బట్టి తెలుస్తోంది. అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలంలో అన్ని కేడర్ల ఉపాధ్యాయులు 78 మంది బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. తక్కువగా దరఖాస్తులు వచ్చిన ఇలాంటి చోట ఫైనల్ సీనియారిటీ జాబితాల్లో తప్పిదాలు బయటపడుతుండటంతో లోపం ఎక్కడ జరిగిందనేది పరిశీలన చేయాల్సి ఉంది.

ఖాళీల జాబితా విడుదల

ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికన బదిలీలు జరుగుతుండగా 6,088 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో కంపల్సరీ ట్రాన్స్‌ఫర్ 1,997 మంది ఉన్నారు. తప్పనిసరి బదిలీల్లో అత్యధికంగా 1,394 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు కాగా గ్రేడ్ -2 హెచ్‌ఎం 105, మిగతా 498 స్కూల్ అసిస్టెంట్ కేడర్‌కు చెందిన వారు ఉన్నారు. సీనియారిటీ జాబితాలు ఇప్పటికే విడుదలయ్యాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని కేడర్ల ఖాళీల జాబితాను ఆదివారం ప్రకటించారు.

నేటి నుంచి వెబ్ ఆప్షన్లు

సోమ మంగళవారాల్లో గ్రేడ్-2 హెచ్‌ఎంలు వెబ్‌ఆప్షన్లు ఎంచుకోవచ్చు. స్కూల్ అసిస్టెంట్లు 5,6,7 తేదీల్లో, ఎస్జీటీలు 5,6,7,8 తేదీల్లో వెబ్ ఆప్షన్లు పెట్టుకునేందుకు అవకాశం కల్పించారు. అన్ని కేడర్లకు బదిలీ ఉత్తర్వులు ఈ నెల 9న వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి.

నేవీ 'పర్యావరణ' ర్యాలీ

బీచ్‌రోడ్డు: ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని మిషన్ లైఫ్ (లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) పేరుతో తూర్పు నావికాదళం పలు కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఆదివారం 500 మంది నేవీ ఉద్యోగులు సైకిల్ ర్యాలీ చేస్తూ.. నగరంలోని పర్యాటక ప్రాంతాల్లో పర్యటించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.

ఇగ్నోలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో 2023 జులై ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ఆన్‌లైన్ విధానంలో ప్రవేశాలు కల్పించనున్నారని పేర్కొన్నారు. జూన్ 30 చివరి తేదీగా https://ignouadmission.samarth.edu.in/ వెబ్‌సైట్ ద్వారా ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

ఎస్పీ బాలుకు స్వరార్చన


ఎస్పీ బాలు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, నిర్వాహకులు

తుమ్మపాల: కల్యాణి ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో పట్టణంలోని ఉడ్‌పేటలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 77వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బాలు పాడిన పలు సినీ మధుర గీతాలను అకాడమీ విద్యార్థులు ఆలపించి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సంగీత దర్శకుడు ఇంద్రగంటి లక్ష్మీశ్రీనివాస్ ఎస్పీ బాలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ 1966లో శ్రీమర్యాదరామన్న చిత్రంలో గాయకునిగా సినీ రంగ ప్రవేశం చేసి 30 వేల పైచిలుకుపైగా పాటలు పాడారన్నారు. సంగీత దర్శకుడిగా, డబ్బింగ్ ఆర్టిస్టుగా, నటుడిగా, నిర్మాతగా అనేక శాఖల్లో తనదైన ముద్ర వేశారని భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని కొనియాడారు. బాలు పాడిన ఒకే ఒక్క లఘుచిత్రానికి తాను సంగీత దర్శకుడిగా చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఆయన సూచనలతోనే 2002లో కల్యాణీ అకాడమిని ప్రపంచ సంగీత దినోత్సవం రోజున ప్రారంభించానన్నారు. కార్యక్రమంలో అకాడమి ప్రిన్సిపాల్ నడిగట్ల వెంకటలక్ష్మి, డిస్ట్రిక్ట్ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


సంఘటన స్థలంలో నానాజీ మృతదేహం

నర్సీపట్నం : మండలంలో గురందరపాలెం జగనన్న లేఅవుట్లో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. రూరల్ ఎస్‌ఐ రామారావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సీపట్నంకు చెందిన కె.నానాజీ కొత్తలక్ష్మీపురానికి చెందిన శ్రావణి అనే అమ్మాయిని వివాహం చేసుకుని అదే గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఇతనికి ఇద్దరు ఆడపిల్లలు, ఒక బాబు ఉన్నారు. ఆయన మరణానికి గల విషయం తెలియరాలేదు. కానీ సమీప గ్రామమైన గురంధరపాలెం జగనన్న లేఅవుట్ కల్లుపాకల సమీపంతో చింతచెట్ల వద్ద మృతి చెంది ఉన్నాడు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్‌ఐ రామారావు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన శ్రీనివాసరెడ్డి

ఎస్.రాయవరం : రోడ్డు ప్రమాదంలో ఆదివారం వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ ప్రసాదరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలో గోకులపాడు వద్ద రాజమండ్రికి చెందిన శ్రీనివాసరెడ్డిని వ్యాన్ ఢీకొంది. ఈ ఘటనలో శ్రీనివాసరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడ్ని 108 వాహనంలో అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తీసుకొస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

క్లుప్తంగా

ఎండ తాకిడికి నిర్మానుష్యంగా రోడ్లు



జనాల్లేక ఖాళీగా దర్శనమిస్తున్న కశింకోటలోని గవరపేట రోడ్డు

కశింకోట : మండల ప్రజానీకం ఆదివారం సూర్య తాపంతో తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అధిక ఉష్ణోగ్రతలతో వృద్ధులు, పిల్లలు సతమతమతమయ్యారు. చాలా వరకు ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో జన సంచారం లేక రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. సాయంత్రం ఆకాశానికి మబ్బులు పట్టి వాతావరణం చల్లబడటంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు.

తాళ్లపాలెంలో ఏరువాక

కశింకోట : మండలంలోని తాళ్లపాలెంలో టీడీపీ ఆధ్వర్యంలో ఆదివారం ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యేల పీలా గోవింద సత్యనారాయణ ఎద్దులు, నాగళ్లకు పూజ చేసి దుక్కి దున్ని కార్యక్రమాన్ని ప్రారంభించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండి, రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

పడమటమ్మలోవలో పౌర్ణమి హోమాలు



హోమంలో పాల్గొన్న భక్తులు

కశింకోట : మండలంలోని విసన్నపేట పడమటమ్మ లోవలో ఆదివారం పౌర్ణమి పురస్కరించుకుని హోమాలు నిర్వహించారు. వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా పూజా ద్రవ్యాలతో హోమం చేశారు. గురువు పెనుమటి సాంబమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి, హోమంలో పాల్గొని పడమటమ్మ వారిని దర్శించుకున్నారు.

బీజేవైఎం కన్వీనర్‌గా తంగేటి శివ



తంగేటి శివ

అనకాపల్లిటౌన్ : భారతీయ జనతా యువ మోర్చా అనకాపల్లి అసెంబ్లీ ప్రచార కమిటీ కన్వీనర్‌గా తనను నియమిస్తూ మోర్చా జిల్లా అధ్యక్షుడు గేదెల స్వరూప్ నియామక పత్రాన్ని అందించినట్లు తంగేటి శివ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాని మోదీ 9 ఏళ్ల పాలనలో దేశం అభివృద్ధి చెందిన విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. తనకీ అవకాశం ఇచ్చిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	: రాజా
అహింస	: సత్యనారాయణ స్క్రీన్-1
పరేషాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
ది కేరళ స్టోరీ	: షిర్డిసాయి
విరూపాక్ష	: పర్తిసాయి
చక్రవ్యూహమ్	: వెంకటేశ్వర
నేను స్టూడెంట్ సర్	: శ్రీసత్య
బిచ్చగాడు-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 9 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 243 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 198 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

దెబ్బతిన్న గ్రోయిన్లు..
అరకొర సాగునీరు



కశింకోట వద్ద శారదానదిపై కాశీమదుం గ్రోయిన్



గ్రోయిన్ నుంచి వృధాగాపోతున్న నీరు

- శారదానదిపై గ్రోయిన్లకు గండ్లు
- ఏళ్ల తరబడి మరమ్మతులు చేయని వైనం
- తాజాగా అంచనాలు సిద్ధం చేసిన అధికారులు

కశింకోట : మండలంలో శారదా నదిపై ఉన్న గ్రోయిన్ల మరమ్మతులు చేపట్టానికి నీటిపారుదల శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మూడు గ్రోయిన్ల మరమ్మతులకు సుమారు రూ.2 కోట్లతో అంచనాలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టడానికి సంసిద్ధంగా ఉన్నారు.

సాగునీటి వృధా

మండలంలోని శారదానదిపై ఉన్న నాలుగు గ్రోయిన్లు బాగా దెబ్బతిన్నాయి. వీటిలో ఉగ్గినపాలెం గ్రోయిన్‌కు గండిపడి పూర్తి నిరుపయోగంగా మారింది. కాశీమదుం, వెదురుపర్తి, పేరంటాలపాలెం గ్రోయిన్లు దెబ్బతిని ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించని స్థితికి చేరుకున్నాయి. వీటి కింద సుమారు 1700 ఎకరాల ఆయకట్టు భూములున్నాయి. ప్రధానంగా చెరకు, ఖరీఫ్ వరి వీటి కింద సాగవుతున్నాయి.

▲ కాశీమదుం కింద సుమారు 900 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. దీని నుంచి కశింకోట, వెదురుపర్తి, అచ్యుతాపురం మండలం పెదపాడు గ్రామాలకు చెందిన పంట భూములకు సాగునీరు సరఫరా అవుతుంది.

▲ వెదురుపర్తి గ్రోయిన్ కింద సుమారు 500 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. దీనిద్వారా వెదురుపర్తితోపాటు పేరంటాలపాలెం గ్రామానికి చెందిన భూములకు సాగునీరు అందుతోంది. ఇది సుమారు 12 ఏళ్ల క్రితం దెబ్బతిన్నప్పటికీ మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో అప్పటి నుంచి మరమ్మతులు లేక ఆయకట్టుకు సక్రమంగా సాగునీరు అందక రైతులు ఏటా నష్టపోతున్న పరిస్థితి ఉంది. 2012లో హుద్‌హుద్ తుపాను సమయంలో దీని మరమ్మతులకు నిధులు మంజూరైనప్పటికీ కాంట్రాక్టర్ ముందుకు రాలేదు. దీంతో పనులు చేపట్టక నిధులు మురిగిపోయాయి.

▲ ఇక పేరంటాలపాలెం గ్రోయిన్ కింద దాదాపు 300 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. దీనికింద పేరంటాలపాలెం, గంటవానిపాలెం గ్రామాలకు చెందిన భూములు సాగవుతున్నాయి.

ప్రస్తుత ప్రభుత్వంలో ముందుకు

ఈ గ్రోయిన్లు చాలా వరకు నది ప్రవాహ ఉధృతికి గత ప్రభుత్వ హయాంలోనే దెబ్బతిన్నాయి. మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. కాశీమదుం గ్రోయిన్‌కు పడిన గండి తాత్కాలికంగా పూడ్చి, సరిపెట్టారు. ఆ తర్వాత పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో గ్రోయిన్ల నుంచి నీరు వృధాగా దిగువకు పోతోంది. ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీరు అందడం లేదు. ఇక వెదురుపర్తి, పేరంటాలపాలెం గ్రోయిన్లకు మరమ్మతులు చేపట్టడానికి గత టీడీపీ హయాంలో హామీ ఇచ్చినా కార్యరూపందాల్చలేదు. ఈ నేపథ్యంలో గ్రోయిన్లకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టడానికి తాజాగా అనకాపల్లి నీటిపారుదల శాఖ అధికారులు అంచనాలు రూపొందించారు. ఉన్నతాధికారులకు నివేదించారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావలసి ఉంది. నిధులు మంజూరైతే పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొంటున్నారు.

నిధులు రాగానే పనులు

మండలంలోని కాశీమదుం గ్రోయిన్ మరమ్మతుకు రూ.43 లక్షలు, వెదురుపర్తికి రూ.75 లక్షలు, పేరంటాలపాలెంకు రూ.72 లక్షలతో అంచనాలు రూపొందించాం. ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరు కావాల్సి ఉంది. నిధులు రాగానే పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటాం.

–హనుమంతరావు, ఏఈ, అనకాపల్లి డివిజన్ నీటిపారుదల శాఖ

రక్తదానం అభినందనీయం



-రక్తదాన శిబిరంలో పాల్గొన్న సీఐ రవికుమార్

అనకాపల్లిటౌన్ : ఆరోగ్యవంతుడైన వ్యక్తి రక్తదానం చేసి, ఆపదలో ఉన్న మరో ముగ్గురు వ్యక్తుల ప్రాణాలను కాపాడవచ్చని అనకాపల్లి రూరల్ సీఐ ఎ.రవికుమార్ తెలిపారు. మండలంలోని జాతీయ రహదారి కొత్తూరు నర్సింగరావుపేటలో ప్రేరక్ ఆర్గనైజేషన్, కల్చర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒరిస్సా రాష్ట్రం, బాలాసూర్ వద్ద జరిగిన రైలు ప్రమాదంలో గాయపడిన వారికి ఆసరాగా ఆదివారం రక్తదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత రక్తదానంతో ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. రైలు ప్రమాదంలో గాయపడినవారికి రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రేరక్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు రాంప్రసాద్, కల్చర్ ఫౌండేషన్ ప్రతినిధులు సాలాపు హరి, అబ్బాస్, గ్రామపెద్దలు నడిపల్లి వెంకటరమణ, గొల్లవిల్లి జానకీరామ్, కసిరెడ్డి సతీష్, ఎన్టీఆర్ వైద్యాలయం రక్తనిధి సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతుల సంక్షేమ నిధికి వినతి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి జలమయ్య

అనకాపల్లి రూరల్ : కౌలు రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏపీ కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పి.జలమయ్య కోరారు. కౌలు రైతుల రక్షణ, సంక్షేమం కోసం వెంటనే రూ.10 వేల కోట్లతో సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనకాపల్లి సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన కౌలురైతు సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కౌలు రైతులకు తక్షణమే గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కౌలు రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం విశాల హృదయంతో వ్యవహరించాలని అభ్యర్థించారు. భూయజమానులతో సంబంధం లేకుండా పంట రుణాలు మంజూరు చేయించాలని, ఇందుకోసం నిజమైన కౌలు రైతులను గుర్తించే ప్రక్రియ చేపట్టాలని కోరారు. గ్రామ సభల ద్వారా కౌలు రైతుల గుర్తింపు త్వరితగతిన పూర్తిచేసి అన్ని సంక్షేమ పథకాలకు అర్హులుగా పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా కౌలు రైతు సంఘం నేతలు పాల్గొన్నారు.

బ్రైట్ మైండ్స్‌తో విద్యార్థుల్లో ఉత్తేజం



కళ్లకు గంతలు కట్టి విద్యార్థులతో చదివిస్తున్న మిషన్ సభ్యులు

అనకాపల్లిటౌన్ : కళ్లకు గంతలు కట్టుకుని చదవడం రాయడం వలన పిల్లల్లో మేధాశక్తి పెరుగుతుందని రామచంద్ర మిషన్ సభ్యులు అన్నారు. స్థానిక కోలపర్తి భవనంలో మిషన్ ఆధ్వర్యంలో జరిగిన బ్రైట్ మైండ్స్ కార్యక్రమంలో భాగంగా పలువురు విద్యార్థుల కళ్లకు గంతలు కట్టి రాయడం, చదవడం నేర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విధానంతో పిల్లల్లో ఉత్తేజం, పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మిషన్ సభ్యులు పద్మలీల, మీనాక్షి, కోలపర్తి జయబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచి పుస్తకాలే ఉత్తమ స్నేహితులు



విద్యార్థులకు వివిధ అంశాల పై అవగాహన కల్పిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు

పాయకరావుపేట : మంచి పుస్తకాలే ఉత్తమ స్నేహితులని, ప్రతి విద్యార్థి మంచి పుస్తకాలను చదివి, అందులోని మంచిని, నీతిని అవగాహన చేసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని విశ్రాంత ఉపాధ్యాయులు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు పలు అంశాల పై విశ్రాంత ఉద్యోగులు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి ఉత్తమమైన విద్యతో పాటు నీతి కథలు, నీతి వాక్యాలపై అవగాహన కలిగి వుండాలన్నారు. అదే విధంగా ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహిస్తూ నిత్యం పుస్తక పఠనం ఎంతో మంచి కార్యక్రమం అన్నారు. అదే విధంగా వ్యాయామం, యోగా, క్రీడల పట్ల అవగాహన కలిగి వుండాలన్నారు. తెలుగు, ఇంగ్లిషు భాషలు చదవడం, రాయడం, బోధించడం పై ఆసక్తి కలిగి వుండాలన్నారు. అదే విధంగా ప్రతి విద్యార్థి కూడా చరిత్ర పఠనంతో పాటు ఆధ్యాత్మిక పరమైన శ్లోకాలను కూడా చదవడం నేర్చుకోవాలన్నారు. గ్రంథాలయ అధికారి వామాల లక్ష్మణరావు, పలువురు విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి పండగ



సత్తెమ్మతల్లిని దర్శించుకుంటున్న గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక : మునగపాకలో పలు చోట్ల ఆదివారం సత్తెమ్మతల్లి అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. చెరువు కాలువ సంఘం అలాగే ములబందగోడీ ప్రాంతాల్లో సత్తెమ్మతల్లి పండగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. మహిళలు ఊరేగింపుగా ఆలయాలకు చేరుకొని అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. దీనిలో భాగంగా ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ సత్తెమ్మతల్లిని దర్శించుకొని పూజలు చేశారు.

విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలు



దేశభక్తి గీతాలు ఆలపిస్తున్న దృశ్యం

మునగపాక : దేశభక్తి గీతాలాపన ద్వారా మానసిక వికాసం పెరుగుతుందని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శివకోటి దుర్గాప్రసాద్ అన్నారు. వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా మునగపాక శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి ఎల్‌వీ రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పిల్లా జగదీష్, బీడీసీ నిర్వాహకుడు కేవీఎస్ అప్పారావు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవరచుకోవాలి



పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): పుస్తక పఠనం ద్వారా ఎన్నో కొత్త విషయాలు, నీతి, నియమాలు తెలుస్తాయని రిసోర్స్ పర్సన్ సురేంద్ర అన్నారు. అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా 28వ రోజైన ఆదివారం ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనాన్ని అలవరచుకోవాలని సూచించారు. గ్రంథాలు, శతకాలు, పద్యాలు చదవాలని సూచించారు. లైబ్రేరియన్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

255 మందికి వైద్య సేవలు

పరవాడ: స్థానిక ఏడీఎన్ పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో వాడచీపురుపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు ప్రారంభించారు. వైద్య శిబిరంలో పాల్గొన్న 255 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ పెందుర్తి నియోజకవర్గ ప్రతినిధి కూండ్రపు కృష్ణంనాయుడు, సంఘ ప్రతినిధులు కూండ్రపు ఉమ, వైద్య నిపుణులు పాల్గొన్నారు.

రైల్వే మంత్రి రాజీనామా చేయాలి



కోన లక్ష్మణ

అనకాపల్లి రూరల్ : ఒడిశా బాలాసోర్ రైళ్ల ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం ఒడిశా రైళ్ల ప్రమాదాల్లో మృతులకు సంతాపం ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా రైల్వే వ్యవస్థలో ప్రయాణికుల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని ఆరోపించారు. రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న లక్షలాది ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లోకో పైలెట్లపై పని భారం కారణంగా ప్రయాణికుల రక్షణ కరువవుతోందన్నారు.

ఆయా పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ



పి.ప్రభావతి, అనకాపల్లి సీడీపీవో

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగావున్న ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి ఈ నెల 12 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని సీడీపీవో పి.ప్రభావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1 నాటికి 21 ఏళ్లు పైబడి 35 ఏళ్లలోపు వయసున్న స్థానిక, వివాహిత అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను పట్టణ సీడీపీవో కార్యాలయంలో అందించాల్సిందిగా కోరారు. అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీ మూలపేట ఖాళీని బీసీ-డీకు, మార్టూరు-2 ఓసీ(జనరల్), పట్టణంలోని 82వ వార్డు పూడిమడక రహదారి సెక్టార్-2 ఖాళీని ఎస్టీ కేటగిరీకి కేటాయించినట్లు వెల్లడించారు.

పర్యావరణంపై కళాజాత నేడు

అనకాపల్లిటౌన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పట్టణంలో కళాజాత, వీధి నాటికల ద్వారా ప్రజలను అవగాహన కల్పించనున్నట్లు మండలి సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను కళ్లకు కట్టినట్లు తెలిపేలా వీధి నాటకాలు, కళాజాతాలను ఏర్పాటుచేస్తున్నట్లు పేర్కొన్నారు.

తీరంలో పర్యాటకుల సందడి



తిక్కవానిపాలెం తీరంలో సందర్శకులు

పరవాడ: తిక్కవానిపాలెం తీరం ఆదివారం పర్యాటకులతో సందడిగా మారింది. వారం రోజుల నుంచి ఎండ వేడిమితో ఉక్కిరిబిక్కిరవుతున్న పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన సందర్శకులు ఆదివారం ఉదయం తిక్కవానిపాలెం సముద్ర తీర ప్రాంతాల్లో సేద దీరడానికి తరలివచ్చారు. తీరంలోని ఎన్టీపీసీ జెట్టీ దిగువన వీస్తున్న చల్లని గాలులను ఆస్వాదిస్తూ ఆట పాటలతో సరదగా గడిపారు. సాయంసంధ్యా సమయంలో తీరంలో జలకాలాటలతో సందడి చేశారు. ముత్యాలమ్మపాలెం తీరంలో మౌలిక సదుపాయాలు లేక సందర్శకుల తాకిడి తగ్గుతోంది. అధికారులు స్పందించి ఎంతో ప్రాముఖ్యత కలిగిన ముత్యాలమ్మపాలెం తీరంలో సందర్శకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

'బీజేపీ ఎంపీని అరెస్ట్ చేయాలి'



మాట్లాడుతున్న శేఖర మంత్రి లక్ష్మణరావు

అనకాపల్లి రూరల్ : మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జిల్లా కార్యదర్శి శేఖరమంత్రి సాయి వెంకట లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన ప్రజా సంఘాల సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన బీజేపీ తీరుపై మండిపడ్డారు. నేరారోపణలు ఎదుర్కొంటున్న ఎంపీని కాపాడేందుకు ప్రయత్నిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును ఆక్షేపించారు. భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ల ప్రకారం ఎంపీపై చర్యలు తీసుకోవడానికి మీనమేషాలు లెక్కిస్తున్న కేంద్రం తీరును సమావేశానికి హాజరైన పలువురు ప్రజా సంఘాల నేతలు ఎండగట్టారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం నాయకురాలు ప్రభావతి, న్యాయవాదులు ఐఆర్ గంగాధర్, కళావతి తదితరులు మాట్లాడుతూ చట్టాన్ని ఉల్లంఘించిన కేంద్ర ప్రభుత్వంపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.బాలకృష్ణ, కనిశెట్టి సురేష్‌బాబు, న్యాయవాది సురేష్, దాసరి సంతోష్, వియ్యపురాజు, పీఎస్ అజయ్ కుమార్, పలు ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

సేదతీర్చిన వరుణుడు



వర్షంలో ప్రధాన రహదారి

అనకాపల్లిటౌన్ : కొన్ని రోజులుగా ఉష్ణతాపంతో అల్లాడిపోయిన పట్టణ వాసులకు ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో కురిసిన వర్షం కాస్త ఉపశమనాన్ని ఇచ్చింది. ఉదయం 9 గంటలకే భానుడు ఉష్ణతాపానికి ఉక్కిరిబిక్కిరైన ప్రజలను ఈ వర్షం సేదతీర్చిందనే చెప్పాలి. కురిసింది చిన్నపాటి వర్షమే అయినప్పటికీ ఆకాశంలో ఏర్పడిన మబ్బులు, ఈదురుగాలులతో వాతావరణం చల్లబడింది. మెరుపులు, ఉరుములు చూస్తే భారీ వర్షం పడుతుందనుకున్నప్పటికీ కొద్దిసేపే వర్షం కురిసింది. వర్షం ఆగిన తర్వాత కూడా ఆకాశంలో మబ్బులు, గాలులు కొనసాగాయి.

ప్రకటన

[illegible] M.V.O.P. No. 8/2021
[illegible]
AND
[illegible]

[illegible]

వై ఆర్డర్ ఆఫ్ ది కోర్ట్
[illegible]

కార్యవర్తనము మరియు వేలం ప్రకటన

[illegible] జిల్లా జడ్జివారి కోర్టులో అమలు అర్జీ సంఖ్య 6/2015లో అసలు వ్యాజ్యము సంఖ్య 296/2011

మధ్య

మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ గాజువాక బ్రాంచి.. తీర్మానము పొందినవారు

మరియు

1. భీమరశెట్టి ప్రేమ సత్య శ్రీనివాస్, 2. భీమరశెట్టి విశ్వేశ్వరరావు 3. భీమరశెట్టి బాల త్రిపుర సుందరి, 4. కొణతాల రామలింగస్వామి 5. దొడ్డి బాబా విశ్వనాథరావు, 6. అల్ల హరిహర గోవిందప్రసాద్ 7. అల్ల కళ్యాణి, 8. కర్రి వెంకటరమణబాబు

..... తీర్పు ఋణగ్రస్తులు

ఈ దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తి శ్రీమతి భీమరశెట్టి బాల త్రిపుర సుందరి ద్వారా మొదటి తీర్పు ఋణగ్రస్తునకు దాఖలా పడినది. సదరు ఆస్తిని పైనుదహరించిన గౌరవనీయులైన న్యాయస్థానములో తేది 21-06-2023న వేలం వేయుటకు న్యాయస్థానమువారు నిర్ణయించి ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున యావన్మందికీ పత్రికా ముఖంగా ఈ వేలం గురించి తెలియజేయడమైనది. కావలసిన వలయువారు ఆస్తి వేలంలో పై తేదీన పాల్గొనగలరు. విశాఖపట్నం జిల్లా, అనకాపల్లి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ తుమ్మపాల శి॥ కొత్తూరు గ్రామం, శారదానగర్, 11వ వీధి తా॥ జి. పట్టా నెం. 160రు బ్లాక్ నెంబరు 2రు సర్వేనెం. 626/2(B)రులో చేరిపట్టిన్ని రస్తాకు తూ. దిశగాయున్న డోర్ నెం. 3-125రులో 122.66 చ॥గజలు చేరిన గ్రౌండ్ ఫ్లోరు, 1వ ఫ్లోరు, 2వ ఫ్లోరు కల్గిన ఆర్.సి.సి బిల్డింగ్ నివేశం ఇంటికి హద్దులు:

తూర్పు: అల్ల పద్మావతిగారి యింటిగోడ, **పడమర:** యీ ఆస్తికిన్ని కొణతాల వరహాలక్ష్మిగారి ఆస్తులున్నూ రహదారి నిమిత్తం సదరు కొణతాల వరహాలక్ష్మిగారు విడిచిపెట్టిన జ4లు వెడల్పుగల రివాజు రస్తా, **ఉత్తరం:** గెడ్డ బంజరు, **దక్షిణం:** యు. ఆశీర్వాదం గారి ఖాళీస్థలం.

గౌరవనీయులైన న్యాయస్థానంలో వేలంపాట జరుగు సమయము ఉదయం గం॥ 10.30 నిల నుండి సాయంత్రం 5.00 మధ్య.

పైన ఉదహరింపబడిన ఆస్తికి సంబంధించి తీర్మానము పొందిన వారి అంచనా విలువ రూ 20,00,000/-

పైన ఉదహరించిన ఆస్తికి సంబంధించి గౌరవ న్యాయస్థానమువారి అమీను విలువ రూ 45,00,000/-

పైన ఉదహరించిన ఆస్తికి సంబంధించి తీర్పు ఋణగ్రస్తులు యొక్క అంచనా విలువ పొందుపరచలేదు.

వేలం తేది: 21-06-2023న

న్యాయస్థానము వారి ఆదేశానుసారము

గమనిక: పై వేలంను, శ్రీ కోర్టువారు 03-06-19 తేదిన జారీచేసిన EA 30/2018 EP 6/2015 ఆర్డరును అనుసరించి, Order ప్రకారం షెడ్యూల్ ఆస్తిపై ఫెడరల్ బ్యాంక్ లిమిటెడ్, అనకాపల్లి బ్రాంచి వారికి గల మార్టిగేజ్ బాకీకి లోబడి జరుపబడును.

B.V.R. JOGA RAO, Advocate
D.No: 3-6-21, Narasingarao Peta,
Anakapalli-531001, Visakhapatnam Dist.(AP)
Cell: 9640783303, 9618771316, 9246627432